# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశవ్యాప్తంగా ఏడు దశలలో 18వ లోక్ సభ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లుగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్ కుమార్ తెలిపారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ శాసనసభకు మే 13న ఎన్నికలు జరగనున్నాయి.
- ❖ రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఈ రోజు నుంచి అమలులోకి వచ్చిందని ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి వెల్లడించారు.
- ❖ రాష్ట్రవ్యాప్తంగా రేపు నిర్వహించే ఎపిపిఎస్సి గ్రూపు-1 ప్రిలిమ్స్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశారు.
- ❖ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాను ఈ రోజు ప్రకటించారు.

==========================

దేశవ్యాప్తంగా ఏడు దశలలో 18వ లోక్ సభ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లుగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్ కుమార్ తెలిపారు. అలాగే నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. దిల్లీలో ఈ రోజు మీడియాతో మాట్లాడుతూ, ఏడు దశల పోలింగ్ అనంతరం జూన్ 4 ఓట్ల లెక్కింపు జరుగుతుందని వివరించారు. కాగా, దేశంలో 96.8 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుష ఓటర్లు 49.7 కోట్లు, మహిళా ఓటర్లు 47.1 కోట్లు వున్నారని ఆయన వివరించారు. ఈ ఎన్నికల కోసం దేశవ్యాప్తంగా 10.5 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ ఎన్నికలతో పాటుగా దేశంలోని పలు రాష్ట్రాలలో 26 స్థానాలకు ఉప ఎన్నికలు కూడా నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 20న నోటిఫికేషన్ విడుదలవుతుందని ఆయన తెలిపారు.

( వాయిస్ 38 సెకన్లు)

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ సీట్లకు, 25 లోక్ సభ స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. విజయవాడలో ఈ రోజు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,

రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరుగుతుందని, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని అన్నారు. అదే విధంగా 46 వేలకు పైగా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుపుతామని వెల్లడించారు. కాగా, ఏప్రిల్ 18న రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని అన్నారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరుకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, ఏప్రిల్ 29న నామినేషన్ల ఉపసంహరణ గడువుగా వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లను ఆదేశించారు. ఈమేరకు ఈ రోజు ఆయన విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన 24 గంటలు లోగా ప్రభుత్వ ఆస్తులపై గల హోర్డింగులు, బ్యానర్లు, జెండాలు వంటివి తొలగించాలని ఆదేశించారు. అదే విధంగా ప్రసార మాధ్యమాల్లో ప్రభుత్వ నిధులతో జారీ చేసే ప్రకటనలు నిలిపి వేయాలని కోరారు. ఎన్నికల నిబంధలను అతిక్రమిస్తే 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలు ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రవ్యాప్తంగా రేపు నిర్వహించే ఎపిపిఎస్సి గ్రూపు-1 ప్రిలిమ్స్ పరీక్షకు విస్తృతమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి తెలిపారు. గ్రూపు-1 ప్రిలిమ్స్ ఏర్పాట్లపై ఈ రోజు విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లు,ఎస్పీలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 301 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయని మొత్తం లక్షా 48వేల 881మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలోని అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల కోసం అభ్యర్థుల జాబితాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ రోజు ప్రకటించింది . వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఈ మేరకు మంత్రి ధర్మాన ప్రసాదరావు అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. అన్ని సామాజిక వర్గాలను పరిగణనలోకి తీసుకుని జాబితా రూపొందించామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జనన మరణాల నమోదు తప్పనిసరిగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.యస్ జవహర్ రెడ్డి అన్నారు. ఎన్నికల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ, వైద్య ఆరోగ్య శాఖలపై వివిధ జిల్లాల కలెక్టర్ లతో ఈరోజు ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జనన, మరణాల చట్టం 2023 గత ఏడాది అక్టోబర్ 1 వ తేదీ నుండి అమలులోకి వచ్చిందని, తెలిపారు. ఈ చట్టం ప్రకారం విద్యా సంస్థలలో చేరేందుకు అలాగే డ్రైవింగ్ లైసెన్స్ జారీకి ఓటరు జాబితా తయారీకి, వివాహ నమోదుకు, ఉద్యోగాల్లో చేరేందుకు పాస్ పోర్ట్ జారీకి, ఆధార్ కార్డు జారీకి లేదా కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఏ ఇతర కార్యక్రమానికి అయినా విధిగా సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ ఎన్నికల కోడ్ నేపధ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రోజు నుంచి వీఐపీ బ్రేక్ దర్శనాల సిఫారసు లేఖల స్వీకరణ రద్దు చేయాలని టీటీడీ నిర్ణయించింది. దీంతో పాటుగా నేరుగా వచ్చే ప్రోటోకాల్ పరిధిలోని వీఐపీలకు మాత్రం దర్శనం కల్పిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. దీని వల్ల సాధారణ భక్తులకు ఎక్కువ సమయం దొరుకుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి

ఆర్జితసేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను విడుదల చేస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ఈ రోజు ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలలో పొట్టి శ్రీరాములు జయంతి ని నిర్వహించారు. నెల్లూరు జిల్లాలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరి నారాయణ నివాళి అర్పించారు. వివిధ జిల్లాలలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా జరుపుకున్నారు

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ, కురుపాం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కురుపాం శాసన సభ్యులు పాముల పుష్ప శ్రీవాణి ఈరోజు శంకుస్థాపన చేశారు. గుణద తీలేసు పంచాయతీలో దిగువ గుణద నుండి బిన్నిడి, గుణద తీలేసు, సవర గుణద, కెమిశిల నుండి కొరిశిల గ్రామాలకు సుమారు 6.63 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం కురుపాం మండలంలో గుమ్మిడిగూడ పంచాయితీ సింగుపురం గ్రామానికి సుమారు 70 లక్షల రూపాయల వ్యయంతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో తేలికపాటి వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదే విధంగా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. రాయలసీమ జిల్లాలలో మాత్రం వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశముందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ గా ధ్యానచంద్ర హెచ్.ఎం జిల్లా కలెక్టరేట్ లో ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ ఇతర అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియచేసారు .

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దిల్లీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ భవన్ విభజనకు సంబంధించి హోం శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆప్షన్- జీకి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు అంగీకారం తెలిపాయని పేర్కొంది. ఈ విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం 11వేల 536 ఎకరాలు కేటాయించారు. అదేవిధంగా తెలంగాణకు 8 వేల 245ఎకరాలు కేటాయించారు ఈ కేటాయింపులకు సంబంధించిన కేంద్రం ప్రతిపాదనకు రెండు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయని వెల్లడిం చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =